విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని వందే భారత్ రైల్వే రూపకర్త, భారత రైల్వే ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ మాజీ జనరల్ మేనేజర్ సుధాన్షు మని అన్నారు. శశి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయస్థాయి సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవం అన్వేషణ-2023 ముగింపు శనివారం ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. భారత్ రైల్వే విశిష్టతను వివరించారు. ఎన్ని కష్టాలు ఎదురైనా విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. కళాశాల ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు దేశానికి విశిష్ట సేవలు చేసిన గొప్ప వారి స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. విజేతలకు సుధాన్షు మని, కళాశాల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, సెక్రటరీ మేకా క్రాంతిసుధ, ప్రిన్సిపల్ డాక్టర్ మొహమ్మద్ ఇస్మాయిల్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అన్వేషణ 2023 కోఆర్డినేటర్ డాక్టర్ టి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అకాల వర్షం.. అనూహ్య నష్టం..!

రెండు రోజులుగా జిల్లావ్యాప్తంగా వర్షాలు
వరి, మామిడి, మిరప, మొక్కజొన్న, పొగాకు పంటలకు నష్టం
దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి
కల్లాల్లోని మిర్చిని కాపాడుకునేందుకు రైతుల అవస్థలు
లబోదిబోమంటున్న అన్నదాత

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అకాల వర్షం అన్నదాతను వణికిస్తోంది. పంటలపై తీవ్ర ప్రభావం చూపనుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. ముఖ్యంగా వివిధ దశకు చేరుకున్న వరి, మామిడి, మిర్చి, మొక్కజొన్న, పొగాకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులకు ఏం చేయాలో అర్థంకాని దుస్థితి నెలకొంది. రెండు జిల్లాల్లోనూ దాదాపు 3.60 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. పంటంతా పొట్ట, ఈనిక దశలో ఉంది. ప్రస్తుతం ఈనిక దశలో వర్షాలు కురుస్తుండటంతో కంకుల మీద ఉన్న సొంపు పడిపోయి పొల్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. రబీలో ఈనిక దశలో వర్షాలు కురిస్తే మెడ తెగులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని రైతులు బెంబేలెత్తిపోతున్నారు. దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి ఉండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈదురుగాలులకు వరి పొలాలు నేలనంటే ప్రమాదం ఉండటంతో అన్నదాత గుబులు చెందుతున్నారు. మరో మూడు రోజులు వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు గుబులు చెందుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేల వరకూ పెట్టుబడులు పెట్టారు. పంటంతా చివరి దశకు చేరింది. సాగునీటి కోసం అధిక పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. వర్షాలతో పంట దిగుబడి తగ్గితే పెట్టుబడులు రావడం కూడా కష్టంగా మారే పరిస్థితి ఉందని రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

అన్ని పంటలకూ నష్టమే

జిల్లాల విభజన తర్వాత ఏలూరు జిల్లాలో దాదాపు 50 వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. పంటంతా పూత, పిందె దశలో ఉంది. అకాల వర్షాలు మామిడి పంటను తీవ్రంగా దెబ్బతీసే పరిస్థితి నెలకొంది. తామర తెగులు, మచ్చతెగులు విజృంభించే అవకాశం ఉందని ఉద్యానవన శాఖాధికారులు రైతులను హెచ్చరిస్తున్నారు. అందుకు సంబంధించిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాకుండా చలిగాలులు, వర్షాలకు మామిడిపూత రాలిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో మామిడి దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఇప్పటికే పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టిన మామిడి రైతులు అకాలవర్షాలతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో లక్ష ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. పంటంతా కోత దశకు చేరింది. వర్షాలు, గాలులకు మొక్కజొన్న మొక్కలు పడిపోవడం, కంకులకు బూజు తెగులు వంటి సమస్యలు తలెత్తనున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా దిగులు చెందుతున్నారు. విలీన మండలాలు కుక్కునూరు, వేలేరుపాడుతోపాటు జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో దాదాపు 30 వేల ఎకరాల్లో రైతులు మిర్చి సాగు చేశారు. పంటంతా కోత దశకు చేరడంతో రైతులు పంట కోసి ఒబ్బిడి చేస్తున్నారు. కల్లాల్లో ఉన్న పంటంతా అకాల వర్షాలకు తడిసి ముద్దవుతోంది. కురుస్తున్న వర్షాలకు ఏజెన్సీ ప్రాంతంలోని వేలేరుపాడు, రేపాకగొమ్ము, రుద్రమ్మకోట, తిరుమలాపురం, చిగురుమామిడి, నార్లవరం, వసంతవాడ వంటి గ్రామాల్లో రైతులు పండించిన మిర్చిని కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టార్పలిన్‌తో కప్పి పంటను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టిన రైతులు లబోదిబోమంటున్నారు. పంట తడిస్తే ధరపై తీవ్ర ప్రభావం చూపనుండటంతో రైతులు గుబులు చెందుతున్నారు. ఏలూరు జిల్లాలో దాదాపు 25 వేల ఎకరాల్లో పొగాకు సాగైంది. పొగాకు ప్రస్తుతం చాలాచోట్ల కోసి పన దశలో ఉంది. వర్షాలకు తడిసి ఆకులోని రసం అంతా కిందకు దిగిపోనుంది. దీంతో పంట నాణ్యత దెబ్బతిని ధరపై తీవ్ర ప్రభావం చూపనుంది. అకాల వర్షం అన్ని పంటల రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. అకాల వర్షాలతో సోకే తెగుళ్లపై వ్యవసాయాధికారులు అవగాహన కల్పించి పంటను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వేలేరుపాడులో మిర్చిపై కప్పిన టార్పాలిన్లు


ఈనిక దశలో ఉన్న వరిపొలం

సిఎం జగన్‌ను కలిసిన ఎంఎల్‌సిలు

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపొందిన కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ సిఎం జగన్‌ను శనివారం ఆయన ఛాంబర్‌లో కలిశారు. వీరిని ముఖ్యమంత్రి అభినందించారు. రాబోయే ఎన్నికల్లో జిల్లాలోని మొత్తం 15 స్థానాలు వైసిపి గెలిచేలా కార్యకర్తలను సన్నద్ధం చేయాలని సిఎం వీరికి సూచించారు. వీరివెంట ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, తానేటి వనిత, మాజీ మంత్రి చెరుకూరి శ్రీరంగనాథరాజు ఉన్నారు.


ఎంఎల్‌సిగా ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రాలతో సిఎం జగన్ వద్ద కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్

నినదిస్తున్న ఉద్యోగులు

ఉద్యమం ఉధృతం చేస్తాం

ప్రభుత్వానికి కలెక్టరేట్ ఉద్యోగుల హెచ్చరిక - 10వ రోజు కొనసాగిన నిరసన

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసి తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఉద్యోగులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా స్థానిక కలెక్టరేట్ ఉద్యోగులు చేపట్టి నిరసన శనివారం నాటికి పదో రోజుకు చేరుకుంది. వివిధ శాఖలకు చెందిన అధికారులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉద్యోగులకు రావాల్సిన అన్ని పెండింగ్ డిఎ లను ఉగాదికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇంటిస్థలాలు వెంటనే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కలక్టరేట్ పరిపాలనాధికారి వై.దుర్గాకిషోర్, సూపరింటెండెంట్ ఎస్.సుబ్రమణ్యం, నిజాముద్దీన్‌షా, సీనియర్ సహాయకులు వివి.పెద్దిరాజు, పి.జగన్మోహన్, జి.కళ్యాణి, పి.గౌతమి, సాంబశివరావు, డిటి.సూర్య నారాయణరాజు, జూనియర్ సహాయకులు స్మైలీ దివ్య, సాయి, జీవన్, సుభాష్, రమా, బుజ్జియ్య, సూర్యకా ంతం, అనురాధ, మురళి, సత్యనారాయణ, రామకృష్ణ, సత్యనారాయణ, శ్రీనివాసరావు, ప్రదీప్, మౌనిక, రవికుమార్, శ్రీనివాస్, ఫణి, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన

ప్రజాశక్తి - భీమవరం

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.జేమ్స్, సాగిరాజు సత్యనారాయణరాజు డిమాండ్ చేశారు. సంఘం పిలుపులో భాగంగా స్థానిక సంఘ కార్యాలయం వద్ద రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతినెలా ఒకటో తేదీన పెన్షన్లను పెన్షనర్లకు వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. పే ఫిక్సేషన్ స్టేట్‌మెంట్లు ఇవ్వాలని, అదనపు పెన్షన్ ఇంతకు ముందు చెల్లించిన క్వాంటం ఆఫ్ ప్రకారం చెల్లించాలని కోరారు. కరువుభత్యం బకాయిలు, పిఆర్‌సి ఎరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. ఇహెచ్‌ఎస్ కార్డు ద్వారా అన్ని వ్యాధులకు అన్ని ఆసుపత్రుల్లో వైద్యం జరిగేటట్లు చూడాలన్నారు. మెడికల్ రీయంబర్స్‌మెంట్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ఖజానా లెక్కల అధికారి ఎ.గణేష్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భీమవరం యూనిట్ అధ్యక్షులు ఎన్ఎస్ఎస్.పాల్, కోశాధికారి పివిఆర్ఎస్ఎస్.సూర్యనారాయణ, భాస్కరరావు, ఉపాధ్యక్షులు అప్పన సత్యనారాయణ, కె.చంద్రరావు, ఆర్.సూర్యనారాయణ, కాలేజ్ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర కోశాధికాకారి సాగి అప్పలరాజు, డాక్టర్ జివి.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

నినదిస్తున్న నేతలు

టెండర్ విధానాన్ని వ్యతిరేకిస్తూ కొనసాగిన ఆందోళన

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఎక్కడా లేని టెండర్ విధానాన్ని తణుకు సీడ్స్‌లో ఎందుకు పెడుతున్నారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అడ్డగర్ల అజయకుమారి అధికారులను ప్రశ్నించారు. స్థానిక సీడ్స్ సంస్థ ముందు టెండర్ విధానాన్ని నిరసిస్తూ శనివారం మూడో రోజు మోకాళ్లపై నిలబడి సిఐటియు ఆధ్వర్యాన నిరసన తెలిపారు. కార్మికుల పొట్టలు కొట్టే టెండర్ రద్దు చేయాలని, కార్మికులకు పాత పద్ధతిలో అగ్రిమెంట్ చేయాలని, సీడ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కార్మికులపై కక్ష సాధింపు చర్యలు ఆపాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అజయకుమారి మాట్లాడుతూ మూటలు మోసుకుని జీవనం సాగిస్తున్నవారి పొట్టలు కొట్టడానికి సిగ్గులేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, టి.రామకృష్ణ, జి.త్రిమూర్తులు, వెంకటరమణ, కె.వరలక్ష్మి, జి.రూతమ్మ, బి.శ్రీహరి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నినదిస్తున్న కార్మికులు

రైతన్న ఉక్కిరిబిక్కిరి

దిగుబడి తగ్గుతుందని వరి రైతుల ఆందోళన
చేపలు, రొయ్యలు తేలిపోతున్నాయని తల్లడిల్లుతున్న ఆక్వా రైతులు

ప్రజాశక్తి - ఆచంట

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం వల్ల శనివారం మండలంలో ఒక మోస్తరు వర్షం కురిసింది. మండలంలో ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కరుగోరుమిల్లి, కోడేరు, భీమలాపురం, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. ఉపరితల ఆవర్తన ద్రోణి కారణంగా మరో మూడు రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతానికి తెగుళ్ల సమస్య లేకపోయినా రాబోయే రోజుల్లో విజృంభించే ప్రమాదముందని చెబుతున్నారు.

పెనుమంట్ర: మండలంలోని శనివారం మధ్యాహ్నం నుండి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పెనుమంట్ర, మార్టేరు, మాముడూరు, మార్టేరు, ఆలమూరు వంటి ప్రధాన కూడళ్లలో భారీ వర్షం కురిసింది.

పాలకొల్లు: పాలకొల్లు పట్టణం పరిసర ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం వరకు వాతావరణం ఎండ, మబ్బులతో ఉన్నప్పటికీ మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. శనివారపు సంతకు తీవ్ర అంతరాయం కలిగింది.

ఆకివీడు: రెండు రోజులుగా వర్షాలతో రైతులు బెంబేలెత్తుతున్నారు. ఒకపక్క వరి రైతు, మరోపక్క ఆక్వా రైతులు విలవిల్లాడుతున్నారు. ఏ రకంగా చినుకుపడినా ఈ దశలో చేనుకు ప్రమాదమే. సాగునీరందక ఇబ్బంది పడుతున్న పొలాలకు మాత్రమే ఈ వర్షం ఉపయోగకరమని చెబుతున్నారు. వర్షాల వల్ల చేపలకు తెగుళ్ళ వచ్చే ప్రమాదం ఉందని, రొయ్య ఏకంగా తిరగబడి చనిపోతుందని ఆక్వా రైతులు ఆందోళనకు గురవుతున్నారు. శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.

మొగల్తూరు : ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం కూడా వర్షం కురవడంతో రహదారులు జలమయమయ్యాయి. మండల కేంద్రం మొగల్తూరు లో పక్కా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు రహదారుల బండి నిలిచిపోయింది దీంతో రహదారులు చిద్రమయ్యాయి. ప్రజల వాహన చోధకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాలు కురిస్తే చేలు దెబ్బ తింటాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే చేలకు పెట్టుబడులు పెట్టామని వర్షాలు తగ్గుముఖం పట్టకపోతే పెట్టుబడులు కూడా రావని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

కాళ్ల: అకాల వర్షం.. చల్లబడ్డ వాతావరణం... అందరికీ ఉపశమనం... అయితే ఆక్వా రైతుకు ఊపిరి ఆడటం లేదు. వాతావరణ మార్పుతో రెండు రోజులుగా చేపలు, రొయ్యలు కళ్లు తేలేస్తున్నాయి. కొన్నిచోట్ల రైతులు చేపలు పట్టుబడి చేసి తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. మండలంలో పలు ప్రాంతాల్లో చేపలు చనిపోకుండా వివిధ మందులు వాడినా ఫలితం లేదు. చెరువుల్లో పిహెచ్ శాతం, డిఒ శాతం బాగా తగ్గింది. దీంతో ఉప్పుటేరు తీర ప్రాంతాల్లో 50 ఎకరాల్లో చేపలు తేలిపోయాయి. కాళ్ల మండలంలో 25 వేల ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. 15 వేల ఎకరాల్లో చేపలు, 10 వేల ఎకరాల్లో రొయ్యల సాగు చేపడుతున్నారు. ఇటీవల చేపల చెరువుల్లో నీటిలో ఉప్పు శాతం పెరిగింది. శీలావతి, కట్ల, మోసు చేపలకు ఆక్సిజన్ ఎక్కువ అవసరం. పంట కాలువ నీరు చేపల చెరువులోకి కొత్తగా నీటిని నింపేంతవరకు ఆక్సిజన్ సమస్య ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. వాతావరణం మారుతుండటంతో పంట చేతికొస్తుందో రాదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ప్రాతాళ్లమెరక, జువ్వలపాలెం, కలవపూడి తదితర గ్రామాల్లో చేపల చెరువుల రైతులు చెరువుల్లో ఉన్న చేపలను దక్కించుకునేందుకు పట్టుబడులు పడుతున్నారు. మొన్నటి వరకు కిలో చేప ధర రూ.115 వరకూ ఉండేది. అయితే ప్రస్తుతం బాగున్న చేపలను కిలో రూ.110కి విక్రయిస్తున్నారు.

మేత తక్కువ వేయాలి
సిహెచ్.రాంబాబు, మత్స్య శాఖాభివృద్ధి అధికారి, కాళ్ల

వాతావరణం చల్లగా ఉన్నప్పుడు చెరువులో మేత తక్కువగా వేయాలి. నిరంతరాయంగా ఏరియేటర్లు తిప్పడం వల్ల చెరువులో ఆక్సిజన్ ఉత్పన్నమవుతుంది. ఆయిల్ ఇంజిన్లతో నీటిని రీసైక్లింగ్ చేయాలి. చెరువుల వద్ద రైతులు అప్రమత్తంగా ఉండాలి.

పాలకొల్లులో భారీ వర్షం

మొగల్తూరులో..

కాళ్లలో హడావుడిగా చేపల పట్టుబడి

కలెక్టర్‌చే ఇంటర్ పరీక్షా కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - భీమవరం

ఇంటర్ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని సిఎస్ఎన్, బ్రౌనింగ్ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఇంటర్ పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోపాలూ జరగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పరీక్షల నిర్వహణ అంతా సీసీ టీవీలతో పర్యవేక్షణను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. వేసవి దృష్ట్యా పరీక్షా కేంద్రంలో తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రానికి వచ్చే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలూ కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని పరిశీలించి ఒఆర్ఎస్, తదితర అత్యవసర మందులు ఉన్నాయా లేదా అని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ ఎస్.శివమరామకృష్ణ, అధికారులు ఉన్నారు.

ఉండి: ఇంటర్ పరీక్షల్లో ఎటువంటి పొరపాట్లూ జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రశాంతి అధికారులను ఆదేశించారు. శనివారం ఉండి మండలం యండగండి జూనియర్ కాలేజీలోని ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు గురించి చీఫ్ సూపరింటెండెంట్ దుర్గారావును అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ ఎం.రవీంద్రకుమార్ ఉన్నారు.

భీమవరంలో పరీక్షా కేంద్రాలను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

అంచనాలు ఆవిరి..!

రాష్ట్ర బడ్జెట్.. మన జిల్లాకు.. మన ప్రాంతానికి.. మాకు ఉపయోగకరమైన అంశాలు ఉండాలని జిల్లావాసులు కోరుకోవడం సహజం. గతంలో ప్రస్తుత పాలకులు ఇచ్చిన హామీలకు సంబంధించి ఈ బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయా, ఉంటే ఎలా ఉండొచ్చు వంటి అంచనాలతో అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టక ముందే జిల్లావాసులు రకరకాలుగా చర్చించుకున్నారు. ఎన్నికల సంవత్సరం ముందు వైసిపి ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్ పెట్టకనే పెట్టింది. 'కొత్త సీసాలో పాత నీరు' చందంగా పథకాల గురించి స్తోత్కర్ష తప్ప జిల్లాకు గతంలో ఇచ్చిన హామీల గురించి ప్రస్తావన లేకపోవడం జిల్లావాసులను తీవ్ర అసంతృప్తికి గురిచేసింది. ప్రతియేటా బడ్జెట్ ముందు గత హామీలను గుర్తు చేసుకుని కేటాయింపులపై అంచనాలు వేసుకోవడం మినహా బడ్జెట్‌లో మాత్రం మొండిచెయ్యి చూపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. ప్రధానంగా ఏలూరు జిల్లా పరిధిలోని పోలవరం నిర్వాసితులకు సంబంధించి రాష్ట్ర బడ్జెట్‌లోనూ స్పష్టత లేకుండాపోయింది. చట్టప్రకారం పరిహారం, పునరావాస ప్యాకేజీ అన్నీ ఇచ్చిన తర్వాతే నిర్వాసితులను గ్రామాల నుంచి కదపాల్సి ఉన్నప్పటికీ ప్రాజెక్టు పనుల రీత్యా వస్తున్న వరద ముంపుతో గత్యంతరం లేని పరిస్థితుల్లో జనమే ఊళ్లు విడిచేలా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. పోలవరం ప్రాజెక్టు కేంద్రం పరిధిలోనిదైనా బిజెపి ప్రభుత్వం నిర్వాసితుల పునరావాసంపై తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. ఈసారైనా నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా కేటాయింపులు ఉంటాయని ముంపు బాధిత ప్రజలంతా ఆశించారు. సుమారు రూ.ఐదు వేల కోట్లకుపైగా కేటాయించినా అవి పునరావాసం, పరిహారం, ప్యాకేజీ వంటి అంశాలపైనే వెచ్చిస్తారనే స్పష్టతా లేదు. ఈ నేపథ్యంలో నిర్వాసితులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంతో కలిసి గత టిడిపి ప్రభుత్వం వలె ప్రస్తుత వైసిపి ప్రభుత్వం కూడా నట్టేట ముంచుతుందనే ఆందోళన, ఆవేదన సర్వత్రా నెలకొంది.

ఇక ఉమ్మడి జిల్లాలో రోడ్ల వ్యవస్థ అధ్వానంగా ఉంది. ఈ వేసవిలో పనులు చేపడతారని ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకూ అంతా ఊకదంపుడుగా ప్రకటనలిచ్చినా కార్యరూపం దాల్చే పరిస్థితి లేదు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, భవనాల శాఖకు కేటాయింపులే చాలా పరిమితంగా ఉన్నాయి. అవి జిల్లాకు వచ్చేటప్పటికి కనీసం ఉమ్మడి జిల్లాలోని ఏదోక ప్రాంతానికి సరిపోవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. చింతలపూడి, తాడిపూడి ఎత్తిపోతల పథకాలకు సంబంధించి కేటాయింపులు గొర్రె తోక బెత్తెడు చందంగానే ఉన్నాయి. ఇక డెల్టా ప్రాంతంలో కీలకమైన వరిసాగుకు దన్నుగా నిలిచే డెల్టా ఆధునికీకరణ పనులకు సంబంధించిన కేటాయింపులు చూస్తే విస్తుపోక తప్పదు. వర్షాకాలం ముందు హడావుడిగా చేపట్టే ఒఅండ్ఎం పనులకు కేటాయించినట్లు కూడా డెల్టా ఆధునికీకరణ పనులకు నిధులు విదల్చకపోవడం వ్యవసాయంపై ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో స్పష్టమవుతోందనే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి. ఇక ఆక్వా యూనివర్సిటీ, ఫిషింగ్ హార్బర్‌తోపాటు డెల్టాను కాలుష్యం బారి నుంచి పరిరక్షించడానికి చేపట్టాల్సిన చర్యలకు సంబంధించిన నిధులను సైతం ఈ బడ్జెట్‌లో కేటాయించలేదు. ఇక వాటర్‌గ్రిడ్ పథకం అటకెక్కినట్లయ్యింది. దీంతో డెల్టావాసులు కలుషిత నీటితో కేన్సర్ వంటి మహమ్మారుల బారిన పడక తప్పని దుస్థితి నెలకొంది. నరసాపురం వద్ద గోదావరిపై కోనసీమ జిల్లాను కలుపుతూ నిర్మించాల్సిన వంతెన గురించిగాని, ఆచంట మండలంలో గోదావరిపై అయోధ్యలంక వద్ద నిర్మించాల్సిన వంతెనకు సంబంధించి ప్రత్యేక ప్రస్తావనేదీ లేదు. ఇక కేంద్రం చేపట్టే రైల్వేలైన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ వాటాకు సంబంధించిన కేటాయింపులెక్కడా కానరాలేదు. దీనివల్లే కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్ నత్తనడకన సాగుతున్న విషయం తెలిసిందే. మొత్తంగా చూస్తే జిల్లావాసులకు రాష్ట్ర బడ్జెట్ ఒక అస్పష్టతతో అంచనాలను ఆవిరి చేసే విధంగా ఉందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

వైసిపిలో జోష్ నింపని ఎంఎల్‌సి ఫలితాలు

స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల ఫలితాల్లో అధికార వైసిపి తన సత్తా చాటింది. స్థానిక సంస్థల్లో తనకున్న బలంకన్నా ఎక్కువ ఓట్లు రావడంతో ప్రథమ ప్రాధాన్యతా ఓట్లుతోనే ఎంఎల్‌సిలుగా కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ గెలుపొందారు. టిడిపి బలపర్చిన స్వతంత్ర అభ్యర్థి వీరవల్లి చంద్రశేఖర్ కేవలం 122 ఓట్లతో సరిపెట్టుకున్నారు. టిడిపి గెలుపొందుతుందని ఎవరూ అంచనా వేయకపోయినా కచ్చితంగా వైసిపి ఓట్లు చీలుస్తుందని అంతా భావించారు. అయితే సాధారణ ఎన్నికల్లో విధానాలకన్నా ధన, కుల, మత ప్రాబల్యం ఎలా ఉందో స్థానిక సంస్థల పెద్దల ఎన్నికల్లోనూ అదే పరిస్థితి ప్రస్ఫుటమైందని ఆయా అభ్యర్థులకు వచ్చిన ఓట్లు చెప్పకనే చెబుతున్నాయి. గెలుపోటములు సంగతి ఎలాగున్నా వైసిపి శ్రేణుల్లో ఈ గెలుపు పెద్దగా జోష్ నింపకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ప్రధానంగా పూర్తిస్థాయి మెజార్టీ ఉన్నా గెలుపు కోసం పెద్దఎత్తున కసరత్తు చేయాల్సి రావడం, ప్రధానంగా ప్రభుత్వ తీరుపై స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతోపాటు జనంలోనూ చర్చ జరగడం ఆ పార్టీ నేతల్లో నిర్వేదాన్ని నింపుతున్నట్లు తెలుస్తోంది. ఫలితంగానే ఈ గెలుపుపై ఆనందంకన్నా వచ్చే ఎన్నికల్లో తమ అంచనాలు ఆవిరికాకుండా ఎలా ముందుకు సాగాలా అనే దానిపై వైసిపి శ్రేణులు తర్జనభర్జన పడుతున్నట్లు అర్థమవుతోందని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్



వెంకటరమణ, సత్యవతి దంపతులను అభినందిస్తున్న మాజీ ఎంఎల్ఎ

వెంకటరమణ, సత్యవతి దంపతులు అభినందనీయులు

ప్రజాశక్తి - కాళ్ల

కోమటిగుంట మాజీ సర్పంచి యలమంచిలి వెంకటరమణ, సత్యవతి దంపతులు 40 ఏళ్లుగా ఆదర్శప్రాయమైన దంపతులుగా జీవనం కొనసాగించటం అభినందనీయమని ఉండి మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు, డిసిసిబి మాజీ ఛైర్మన్ ముత్యాల రత్నం అన్నారు. మండలంలోని కోమటిగుంటలో మాజీ సర్పంచులు యలమంచిలి వెంకట రమణ, సత్యవతి దంపతుల షష్టిపూర్తి మహోత్సవం, 40వ వివాహ వార్షికోత్సవం నిర్వహించారు. కోమటి గుంట గ్రామ సర్పంచులుగా యలమంచిలి వెంకటరమణ, సత్యవతి దంపతులిద్దరూ గ్రామాభివృద్ధికి తన వంతు సహకారం అందించారని పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గుండాబత్తుల వెంకట నాగేశ్వరరావు, కోమటిగుంట టిడిపి గ్రామ అధ్యక్షులు గుర్రం నాగ వెంకట సత్యనారాయణ, కాళ్ల మండల తెలుగు యువత అధ్యక్షులు మంతెన నాగ ఆంజనేయులు, మాజీ ఎంపిపిలు ఆరేటి వెంకటరత్నప్రసాద్, కందుల వెంకట మల్లికార్జునరావు, మాజీ సర్పంచులు యలమంచిలి రామాంజనేయులు, కట్రెడ్డి శ్రీనివాసరావు, బండారు వేణు, ఎరుబండు రామాంజనేయులు, బోనం శివకుమార్, తోట ఫణిబాబు, పలు గ్రామాల గ్రామ సర్పంచులు గోళ్ల పండు పాల్గొన్నారు.

బకాయిలె చెల్లించాలని డిమాండ్ చేస్తున్న నాయకులు

ఉపాధి హామీ వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉపాధి హామీ వేతన బకాయిలు వెంటనే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. ఉపాధి పని ప్రదేశాలు పర్యటనలో భాగంగా శనివారం మండలంలోని అరుళ్ల గ్రామం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న గతేడాది వేతన బకాయిలను వెంటనే ఇప్పించాలని ఉపాధి కూలీలు డిమాండ్ చేశారు. ఉపాధి కూలీ రూ.600 ఇవ్వాలని, రెండు వందల రోజులు పని దినాలు పెంచాలని కూలీలు నినాదాలు చేశారు. బడ్జెట్‌లో ఉపాధి హామీకి నిధులు తగ్గించడంపై కేంద్ర ప్రభుత్వానికి కూలీలు పట్ల చిత్తశుద్ధి లేదని తెలిపారు. తగ్గించిన నిధులు పెంచాలని కూలీలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మానుకొండ నాగేశ్వరరావు, చదలవాడ తాతయ్య, మాంద్రు కుమారి, అవతారం, పోలాస మావుళ్లు, మాన్యం సత్యనారాయణ, ముమ్మిడివరపు మరియమ్మ పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీని అధ్యయనం చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నూతన టెక్నాలజీని అధ్యయనం చేసి సొసైటీకి ఉపయోగపడే ఉత్పత్తులు తీసుకురావాలని ప్రముఖ సాఫ్ట్‌వేర్ నిపుణులు స్వేచ్ఛ ఫౌండేషన్ ఎపి జనరల్ సెక్రటరీ శ్రీపతి రాయ్ అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ అప్లికేషన్స్ అంశంపై జరిగే వర్క్ షాపునకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ కార్యక్రమానికి సిఎస్‌సి హెడ్ డాక్టర్ వి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీపతిరాయ్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు సిలబస్‌కు పరిమితం కాకుండా నూతన టెక్నాలజీని ఎప్పటికప్పుడు అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ గూగుల్ సర్టిఫికెట్ కోర్స్‌కు తమ కళాశాలను ఎంపిక చేయటం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కోర్సులో ఉత్తీర్ణులైన వారికి గూగుల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు ఇంటర్న్‌షిప్ వంటి అవకాశాలు కూడా లభిస్తాయని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంజినీరింగ్ విద్యలో సిలబస్‌లో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. కరెంట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా విద్యార్థి శిక్షణ పొందితేనే ఉద్యోగ అవకాశాలు లభ్యమవుతాయని, విద్యార్థులు దీనిని సీరియస్‌గా గమనించాలని ఆయన నొక్కి చెప్పారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ వి.చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎప్పటికప్పుడు నూతన టెక్నాలజీని అందించేందుకు ఇటువంటి వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంకె.కామేశ్వరరావు, డాక్టర్ పి.సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

28 నుంచి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఈ నెల 28, 29, 30 తేదీల్లో తణుకులో భారత విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశాలు జరగనున్నట్లు జిల్లా అధ్యక్షులు పి.వాసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీ సమావేశాల్లో రాష్ట్రంలోని విద్యారంగంపై, సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ఎస్ఎఫ్ఐ నాయకులు ఈ సమావేశాలకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు విపి.సాను హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ప్రజలు, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా కిషోర్‌కుమార్ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - ఆచంట

వైసిపి సీనియర్ నాయకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్ పుట్టినరోజు వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి మెడపాటి సాయి చంద్రమౌళిరెడ్డి, వైసిపి యువ నాయకులు మేడపాటి సురేష్‌రెడ్డి, ఆచంట సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు, సిద్దాంతం సర్పంచి చింతపల్లి గనిరాజు (చంటి), పెనుమంచిలి సర్పంచి గణేశులు శేషవాణి సుబ్బారావు, శేషమ్మ చెరువు సర్పంచి జక్కంశెట్టి శ్రీరాములు, జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ఉమాదేవి, ముప్పాళ్ల వెంకటేశ్వరరావు, ఎంపిటిసిలు ఉల్లం జ్యోతి రామానుజం పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

గంజాయి ముఠా అరెస్టు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం, మొగల్తూరు మండలాల్లో గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని అరెస్టు చేశామని జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ తెలిపారు. నరసాపురంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. గంజాయి విక్రయిస్తున్న ముఠాను ఉన్నతాధికారుల పర్యవేక్షణలో నరసాపురం పట్టణ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసయాదవ్, పట్టణ ఎస్ఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టుకున్నట్లు తెలిపారు. ఏలూరి శ్యామ్‌సన్, బెవర వెంకటేష్, గొల్ల విక్రాంత్‌సాగర్, ఇద్దరు బాలలను అరెస్టు చేసినట్లు తెలిపారు. పశ్చిమగోదావరిని గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని ఎస్‌పి చెప్పారు. కుటుంబ సభ్యులు యువతకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చి చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం : ఎస్‌పి రవిప్రకాష్

మరణించిన వారి కుటుంబ సభ్యులకు చెక్కును అందిస్తున్న ఎస్‌పి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పోలీసు కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎస్‌పి రవిప్రకాష్ అన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తూ అనారోగ్యంతో సిబ్బంది మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ఇటీవల పోలీస్ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఎస్‌పి శనివారం ఆయన కార్యాలయంలో ఆర్థిక సాయం అందించారు. ఇటీవల నరసాపురం ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్ వైవి.నాగేశ్వరరావు కుటుంబానికి రూ.లక్ష చెక్కును భార్య విజయలక్ష్మికి, హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ఆర్.శ్రీనివాసరావు కుటుంబానికి రూ.లక్ష చెక్కును భార్య కనకదుర్గకు అందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ మరణించిన సిబ్బంది కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను కలవవచ్చని చెప్పారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన ఇతర అన్ని బెనిఫిట్స్‌లను త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ ఎవి.సుబ్బరాజు పాల్గొన్నారు.

గరగపర్రులో అలజడి!

వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహ ఏర్పాటుతో గ్రామంలో అలజడి

శాసనమండలి ఛైర్మన్ హెచ్చరించినా పట్టించుకోని వార్డ్ సభ్యుడు

నిర్మాణాన్ని అడ్డుకున్న దళితులు

అధికారుల ఆదేశాలతో పనులు నిలిపివేత

గ్రామస్తులతో మాట్లాడుతున్న విఆర్ఒ నాయుడు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఒకరు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్... మరొకరు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి.. వీరిద్దరి ప్రతిష్టను అపహాస్యం చేసేందుకు ఒడికట్టాడు అధికార పార్టీకి చెందిన వార్డు సభ్యుడు. దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సాంఘిక బహిష్కరణకు గురైన గరగపర్రు అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు ప్రాంతంలో రాజశేఖర్ రెడ్డి విగ్రహం ఏర్పాటుకు ఆ వార్డు సభ్యులు చర్యలు తీసుకోవడంతో గ్రామంలో మళ్లీ అలజడి మొదలైంది. గతంలో రాజశేఖర్‌రెడ్డి విగ్రహ నిర్మాణ పనులు దళితులు అడ్డుకుని శాసనమండలి ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లడంతో అది సరైన పద్ధతి కాదని సంబంధిత వ్యక్తిని హెచ్చరించినప్పటికీ పట్టించుకోకుండా శనివారం నిర్మాణ పనులు మళ్లీ చేపట్టారు. ఈ నేపథ్యంలో దళిత ప్రాంతానికి చెందిన కొంతమంది ఈ పనులు అడ్డుకున్నారు. గరగపర్రులో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారంటూ దళితులను సాంఘిక బహిష్కరణ చేయడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం అందరికీ తెలిసిందే. ఈ ఘటనలో దళితులకు పరిహారం అందడంతో పాటు బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ప్రభుత్వ లాంఛనాలతో గరగపర్రు పాత పంచాయతీ భవనం ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐదేళ్ల అనంతరం గ్రామంలో ఏర్పడిన అలజడిని మర్చిపోయి అందరూ ఐక్యంగా ముందుకు సాగుతున్న తరుణంలో అధికార పార్టీకి చెందిన సభ్యుడు అంబేద్కర్ విగ్రహ నిర్మాణ ప్రాంతంలోనే సమాంతరంగా రాజశేఖర్‌రెడ్డి విగ్రహ నిర్మాణాన్ని చేపట్టారు.



రాజశేఖర్ రెడ్డి విగ్రహం ఏర్పాటుకు చేపట్టిన నిర్మాణం

రాజశేఖర్‌రెడ్డి మరణించి సుమారు 12 ఏళ్ల తర్వాత వివాదాల కేంద్ర బిందువుగా ఎటువంటి అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తున్న ఈ నిర్మాణాన్ని అంబేద్కర్ వాదులు, స్థానిక దళితులు గతంలో అడ్డుకున్నారు. అయినా తీరు మారకుండా తిరిగి మళ్లీ నిర్మాణ పనులను వార్డు సభ్యుడు ప్రారంభించాడు. దీంతో ఆగ్రహించిన స్థానికులు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అందరికీ కనిపించకుండా ఉండాలని దుర్బుద్ధితో ఈ విధంగా రాజశేఖర్‌రెడ్డిని అడ్డుపెట్టుకుని రాజకీయం చేయడం తగదని నిర్మాణ పనులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ విషయాన్ని పంచాయతీ రెవెన్యూ అధికారుల దృష్టికి స్థానిక దళితులు తీసుకెళ్లడంతో వారు అక్కడకు చేరుకుని నిర్మాణ పనులను మరో మారు నిలుపుదల చేశారు.

తీరు మార్చుకోని వార్డు సభ్యుడు

అంబేద్కర్ విగ్రహ సమీపంలో డ్రెయినేజీ ప్రాంతంలో రాజశేఖర్‌రెడ్డి విగ్రహ ఏర్పాటుపై గతంలో స్థానికులు అభ్యంతరం చెప్పారు. రాజశేఖర్ రెడ్డి విగ్రహం ఏర్పాటు చేస్తున్న వార్డు సభ్యుడు విగ్రహం ముసుగులో రాజకీయ లబ్ధి పొందాలనే ఆలోచనతో, సానుభూతిని పొందాలనే ఆకాంక్షతో ఈ విషయాన్ని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఆయన హెచ్చరించినట్లు తెలిసింది. రాజశేఖర్ రెడ్డి అంటే అందరికీ గౌరవమని, ఆయన విగ్రహం ఏర్పాటుకు ఎవరికి అభ్యంతరం ఉండదని, అయితే కావాలని గ్రామంలో అశాంతిని రగిలించే విధంగా విగ్రహం ఏర్పాటు చేయాలనుకోవడం సరికాదని చెప్పినట్టు సమాచారం.

వివక్ష కొనసాగుతుందనడానికి ఇదే నిదర్శనం

అంబేద్కర్ విగ్రహం ప్రాంతంలో కావాలని రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారని దళితులు, దళిత సంఘాలు ఆరోపిస్తున్నాయి. గ్రామంలో విశాలమైన ప్రాంతాలు అనేకం ఉన్నాయని, అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు పక్కనే నాలుగు అడుగుల స్థలంలోనే ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో వివక్ష కొనసాగుతుందనడానికి ఈ ఘటన నిదర్శనమని దళిత సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

పార్టీకి తీవ్ర నష్టం

రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఏర్పాటు చేసుకునే అవకాశం ఉన్న అటువైపు వెళ్లకుండా కేవలం తన స్వార్థం, రాజకీయ లబ్ధి కోసం పాటుపడుతున్న వార్డు సభ్యుడిపై గ్రామంలోని అధికార పార్టీకి చెందిన నాయకులే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వార్డు సభ్యుడి వ్యవహార శైలితో పార్టీకి తీవ్ర నష్టం ఏర్పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని వైసిపి నియోజకవర్గ అధినాయకుడు దృష్టికి తీసుకువెళ్లాలనే ఆలోచనతో గ్రామ

అక్రమ లేఅవుట్లకు అనుమతులిస్తే చర్యలు

ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ సూర్యతేజ

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో అక్రమ లే అవుట్లను ప్రోత్సహించినా, అనుమతులు ఇచ్చినా సంబంధిత అధికారులను సస్పెండ్ చేస్తామని ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ హెచ్చరించారు. కలెక్టరేట్ నుంచి పురపాలక సంఘం కమిషనర్లు, ఇఒపిఆర్‌డిలు, టౌన్ ప్లానింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో అక్రమ లే అవుట్లపై ఆయన శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘాలు, మండలాలు, గ్రామాల వారీగా ఉన్న లే అవుట్లపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అక్రమ లే అవుట్లపై 220 ఫిర్యాదులు స్పందన కార్యక్రమంలో అందాయని, దీనిపై కలెక్టర్ ప్రశాంతి ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. వీటిని పరిశీలించి అక్రమాలు రుజువైతే సంబంధిత అధికారులపై, సిబ్బందిపై చర్యలు తప్పవని తెలిపారు. నిబంధనల ప్రకారం అనుమతి తీసుకోవడంతో పాటు పది శాతం భూమి ప్రభుత్వానికి ఇవ్వాలని, 33 శాతం రోడ్లు వేయాలని తెలిపారు. ఆమోదం పొందిన ప్లాన్ ప్రకారం లే అవుట్లు వేయాలన్నారు. అక్రమ మట్టి తవ్వకాలు, రవాణా చేయటం వంటివి జరగకుండా గట్టి నిఘా పెట్టాలన్నారు.

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి జెసి సూర్యతేజ

ఎంఎల్‌సిల విజయంతో నూతనోత్సాహం : టిడిపి

ప్రజాశక్తి - ఉండి

పట్టభద్రుల ఎంఎల్‌సి విజయంతో టిడిపి క్యాడర్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, ఉండి మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. పట్టభద్రుల ఎంఎల్‌సి విజయంతో ఉండి మెయిన్ సెంటర్లో శనివారం రాత్రి టిడిపి నేతలు సంబరాలు నిర్వహించి, బాణసంచా కాల్చారు. అనంతరం వారు మాట్లాడుతూ పశ్చిమ, రాయలసీమ ఎంఎల్‌సి స్థానానికి సంబంధించి పాణ్యం నియోజకవర్గ పరిశీలకులుగా పనిచేసినట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ క్యాడర్ మరింత ఉత్సాహంతో 2024 సాధారణ ఎన్నికలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉండి ఎఎంసి మాజీ ఛైర్మన్ సాగిరాజు సాంబశివరాజు, గొట్టుముక్కల సత్యవర్మ, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరవాసరం :ఇటీవల నిర్వహించిన ఎంఎల్‌సి ఎన్నికల్లో నైతిక విజయం తమదేనని టిడిపి నాయకులు అన్నారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో స్వాతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన టిడిపి నేత వీరవల్లి చంద్రశేఖర్ స్వగ్రామం పడమటిపాలెంలో తన ఇంటి వద్ద శనివారం ఆ పార్టీ మండల అధ్యక్షులు కొల్లేపరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా టిడిపి నాయకులు మాట్లాడు తూ మెజార్టీ తమకే ఉందని చెప్పుకున్న వైసిపి నాయకులు వారి పార్టీ ఓటర్లనే వారే డబ్బుతో కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి ఎదుర్కొన్నారన్నారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, ఎంపిపి దుర్గాభవాని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

అనిల్ అంబేద్కర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రసన్నమౌనికకు పోస్టల్ ఉద్యోగ సంఘాల నాయకుల సంఘీభావం

ప్రజాశక్తి - మొగల్తూరు

పోస్టల్ శాఖ రామన్నపాలెం గ్రామీణ సబ్ పోస్ట్ మాస్టర్ బి.ప్రసన్న మౌనిక పట్ల వేధింపులకు పాల్పడిన ఆ శాఖ పాలకొల్లు ఎఎస్‌పి అనిల్ అంబేద్కర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ శాఖ ఉద్యోగ వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం రామన్నపాలెంలోని ఆ శాఖ కార్యాలయానికి ఎనిమిది కార్మిక సంఘాల నాయకులు వచ్చి బాధితురాలితో మాట్లాడి సంఘీభావం తెలిపారు. బాధితురాలు ఉద్యోగ విరమణ చేసే ఆలోచనను మానుకోవాలన్నారు. తామంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గత నెల 23న కార్యాలయ సమయం ముగిసిన అనంతరం పాలకొల్లు ఎఎస్‌పి అనిల్ అంబేద్కర్ తనిఖీకి వచ్చి ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని తెలిపారు. దీంతోపాటు కార్యాలయంలోని రూ.25 వేల నగదు తనతో తీసుకువెళ్లారని తెలిపారు. దీంతో ఆమె ఆందోళనకు గురై మరుసటి రోజు భీమవరంలోని ఎస్‌పి బాలసుబ్రమణ్యంకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారని తెలిపారు. సమాచారం తెలుసుకున్న అనిల్ అంబేద్కర్ మద్దతు దారులను బాధితురాలి ఇంటికి పంపి ఆమెను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. అంబేద్కర్ తనతో తీసుకువెళ్లిన రూ.25 వేల నగదులో రూ.20 వేలు సీతారామపురం సబ్ పోస్టాఫీస్‌లో జమ చేశారన్నారు. పాలకొల్లులోని ఎఎస్‌పి గతం నుంచి కూడా ఆ శాఖలోని పలువురు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి లైంగికంగా వేధించారని ఆరోపించారు. దీనిపై పోస్టల్ శాఖ రాష్ట్ర జాతీయ స్థాయి ఉన్నతాధికారులకు తాము కూడా ఫిర్యాదు చేశామన్నారు. వెంటనే చర్యలు చేపట్టకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఆల్ ఇండియా పోస్టల్ గ్రామీణ డాక్ సేవక్ అధ్యక్షులు డివి.రావు, పలు సంఘాల నాయకులు బి.శ్రీధర్‌బాబు, ఎం.తిరుమలరావు, యువి.రామకృష్ణ, ఎస్.నాగేశ్వరరావు, పలు సంఘాల నాయకులు ఉన్నారు. దీనిపై ఆ శాఖ భీమవరం ఎస్‌పి బాలసుబ్రమణ్యంను వివరణ కోరగా నిందితుడు పరారీలో ఉన్నాడని తెలిపారు.

గ్రామపంచాయతీ కార్యాలయము, కాళ్ళపాలెం

ఆర్.ఓ.సి.నెం. 1/2023 **టెండరు నోటీసు** తేది. 17-03-2023

ఏలూరు జిల్లా, కలిదిండి మండలం, కాళ్ళపాలెం గ్రామ పంచాయతీ ఏరియాలో ఈ దిగువ షెడ్యూల్ నందు తెలిపిన పనులు చేయుటకు కాంట్రాక్టు లేబర్ పద్ధతి పై నలుగురు వ్యక్తులు ఒక సంవత్సరము అనగా ది.01-04-2023 నుండి 31-03-2024 వరకు పనులు చేయుటకు ది.21-03-2023వ తేదీ మంగళవారం సాయంత్రం 3:00 గం॥ల వరకు టెండర్లు స్వీకరించబడును. సదరు టెండర్లు అదే రోజు సాయంత్రం 3:30 గం॥లకు టెండరు దారుల సమక్షంలో తెరవబడును. సదరు టెండర్లు గ్రామ పంచాయతీ కార్యదర్శిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని స్వీకరించబడును. ఇతర విషయములకు పంచాయతీ కార్యాలయం పనిచేయు వేళల యందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	టెండరు వివరములు	కాలపరిమితి	ధరావతు
1	ఫిట్టర్-1 (ఒక వ్యక్తి సేవలు)	ది.01-04-2023 నుండి 31-03-2024	రూ.1000/-
2	ఫిట్టర్-2 (ఒక వ్యక్తి సేవలు)	ది.01-04-2023 నుండి 31-03-2024	రూ.1000/-
3	స్వీపర్ (ఒక వ్యక్తి సేవలు)	ది.01-04-2023 నుండి 31-03-2024	రూ.1000/-
4	ఎలక్ట్రిషియన్ (ఒక వ్యక్తి సేవలు)	ది.01-04-2023 నుండి 31-03-2024	రూ.1000/-

నోట్: 1) పూర్వం అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
2) గ్రామ పంచాయతీ నిధుల నిల్వలను బట్టి జీతాలు ఇవ్వబడును.
3) టెండర్లు స్వీకరించుటకు తిరస్కరించుటకు పంచాయతీ వారికి అధికారము కలదు.

సం/- శ్రీమతి పెటేటి స్వర్ణకుమారి, సర్పంచ్, కాళ్ళపాలెం, కలిదిండి మండలం, ఏలూరు జిల్లా

సం/- ఆర్.వి.ఉదయ్‌కుమార్, పంచాయితీ కార్యదర్శి, కాళ్ళపాలెం, కలిదిండి మండలం, ఏలూరు జిల్లా

గ్రామపంచాయతీ కార్యాలయము, కోరుకొల్లు

ఆర్.ఓ.సి.నెం. 1/2023 **టెండరు నోటీసు** తేది. 17-03-2023

ఏలూరు జిల్లా, కలిదిండి మండలం, కోరుకొల్లు గ్రామ పంచాయతీకి సంబంధించి కాంట్రాక్టు లేబరు పోస్టులు భర్తీ చేయు నిమిత్తం టెండర్లు పిలుచుటకు పంచాయతీ నుండి టెండరు ప్రకటన ఇచ్చుటకు పంచాయతీ వారు అంగీకరించినారు. ది.20-03-2023వ తేదీన ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు పంచాయతీ సెక్రటరీ గారిచే టెండర్లు తీసుకొనబడును. పంచాయతీ సెక్రటరీ గాని, వారి అనుమతి పొందిన వారు గాని అయి ఉండవలెను.

వ.నెం.	పోస్టుల వివరాలు	పోస్టులు	టెండరు ధరావతు
1	స్వీపర్లు	10	రూ.5000/- లేక సాల్వెన్స్ సర్టిఫికెట్
2	ట్యాంక్ ఆపరేటర్ మరియు ఫిట్టర్	3	రూ.5000/- లేక సాల్వెన్స్ సర్టిఫికెట్
3	ట్రాక్టర్ డ్రైవర్	1	రూ.5000/- లేక సాల్వెన్స్ సర్టిఫికెట్
4	ఎలక్ట్రిషియన్	1	రూ.5000/- లేక సాల్వెన్స్ సర్టిఫికెట్
5	ఎలక్ట్రిషియన్ సహాయకుడు	1	రూ.5000/- లేక సాల్వెన్స్ సర్టిఫికెట్

పనిదినములు: ది.01-04-2023 నుండి ది.31-03-2024 వరకు

నోట్: 1) పై తెలిపిన పనులకు మాత్రమే కాకుండా పంచాయతీకి సంబంధించిన ఇతర పనులు కూడా చేయుటకు అంగీకారం తెలుపవలెను.
2) గ్రామ పంచాయతీ నిధుల లభ్యతను బట్టి జీతం ఇవ్వబడును.
3) గతంలో ఈ పంచాయతీలో పని చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
4) 60 సం॥లు దాటిన వారు టెండరుకు అనర్హులు.

సం/- బి.ఎల్.కె.దుర్గ, సర్పంచ్, కోరుకొల్లు, కలిదిండి మండలం, ఏలూరు జిల్లా.

సం/- ఆర్.వి.ఉదయ్ కుమార్, కార్యదర్శి, కోరుకొల్లు, కలిదిండి మండలం, ఏలూరు జిల్లా.

పురుగుమందులు పిచికారీ చేయొద్దు

ప్రజాశక్తి - ఆచంట

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన వల్ల కురిసే కొద్దిపాటి వర్షాలకు వరి పంటకు ఇబ్బంది ఉండదని మండల వ్యవసాయ అధికారి కె.రాజశేఖర్ తెలిపారు. కొద్దిపాటి వర్షం వల్ల పంటకు ఎలాంటి నష్టం ఉండదని, రైతులు ఆందోళనతో పురుగుమందులు పిచికారీ చేయవద్దని ఆయన సూచించారు.

దిండ్లలో అన్నసమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

పేరుపాలెం సౌత్ పంచాయతీ పరిధి దిండ్లలో ఉన్న కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. వారం రోజులుగా అమ్మవారి జాతర మహోత్సవాలు ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ఆలయానికి వెండి బహూకరణ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయానికి పాలకొల్లు సుధ స్వీట్స్ అధినేత సోమిశెట్టి రంగప్రసాద్, అనంతలక్ష్మి దంపతులు అరకెజీ వెండి బహుకరించారు. ఆలయ ఛైర్మన్ జోగి వెంకటేశ్వరరావు, ఇఒ ముచ్చర్ల శ్రీనివాస్, ఆలయ పురోహితులు కృష్ణచైతన్య, ఉన్నమట్ల సురేష్‌కు వెండిని అందించారు. దంపతులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు.

పాస్‌పోర్టు పోయినది

షేక్ సుభాని, భర్త: కరీం అను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. ఇంటి నుండి ఫైర్ స్టేషన్ సెంటర్‌కి జిరాక్సు నిమిత్తం వెళ్తుండగా నాయొక్క పాస్‌పోర్టు పడిపోయినది. పాస్‌పోర్టు నెంబర్: **T0938860 గల పాస్‌పోర్టు** ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

షేక్ సుభాని
భర్త: కరీం, H.No. 26-2-38, అశోక్ నగర్, బురగ గూడెం, కొత్తూరు, ఏలూరు జిల్లా, పిన్: 534 002. సెల్ : 81433 56003

CHANGE OF NAME

I, KARRI HARISH BABU, Date of Birth 29-07-2000, Residing at D.No. 3-73, Bondada Road, Jakkaram Village, Kalla Mandal, West Godavari District - 534 206, Andhra Pradesh have changed my name form **KARRI HARISH (Old Name) to KARRI HARISH BABU (New Name).** Hence after all my documents and correspondence will continue with my New Name **KARRI HARISH BABU.**

KARRI HARISH BABU
D.No. 3-73, Jakkaram Village, Kalla Mandal, West Godavari District, Andhra Pradesh - 534 206

In The Court Of The Principal Distrtict Judge W.G.Dist :: Eluru
M.V.O.P.No. 540/2022

Between:
Chitturi Ranga Rao ***...Petitioner***
AND
Tavakkal Beig and Others ***...Respondents***

పై నెంబరు పిటీషనులో 1వ రెస్పాండెంటు అయిన R1: Being Tavakkal, S/o. Yusaf Beig, R/o. H.NO. 18-1-1/1, Gun Bazar, 48th Division, Eluru, W.G.Dist., అను వారికి నోటీసులు అమలు కొరకు **ది.20-03-2023వ తేదీకి వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదా రోజు ఉదయం గం॥10:00 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలు తెలుపుకోవలెను.** లేని ఎడల వారి పరోక్షమందు సంగతులు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఏలూరు, 17-03-23. **ఇ.శ్రీనివాసబాబు**, న్యాయవాది, ఏలూరు.

ప్రకటన

మా నాయనమ్మగారైన **కూరపాటి వెంకటసుబ్బమ్మ గారికి వారి తండ్రిగారైన వేగుంట కాశీవిశ్వానాధరావు** గారు ది. 27-08-1957వ సం॥రం తేదీన ఏలూరు సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయము నందు దఖలు దస్తావేజు వ్రాయించి, దఖలు దస్తావేజు నెం.4878/1957రుగా రిజిస్ట్రీ చేయించిన దరిమిలా ఆమెకు సంక్రమించిన స్థిరాస్థి పెదపాడు మండలం, వట్లూరు గ్రామంలోని సర్వే నెం. 331రులో య.3-56ట్లు, సర్వే నెం.332/2లో య.3-18ట్లు, సర్వే నెం.332/3రులో య.0-6ట్లు, సర్వే నెం. 345లో య.1-87ట్లు, సర్వే నెం.358/2లో య.1-26ట్లు వెరశి య.9-93ట్లు సంక్రమించినది. తదుపరి మా నాయనమ్మగారైన కూరపాటి వెంకట సుబ్బమ్మ గారు నాకు అనగా కూరపాటి తాండవ కృష్ణమోహన్‌కు ది.25-02-2003 వ తేదీన దఖలు దస్తావేజు నెం. 1529/2003రుగా ఏలూరు యస్.ఆర్.ఓ.లో రిజిష్టరీ చేయించిన దరిమిలా నాకు సంక్రమించిన స్థిరాస్థి వట్లూరు గ్రామంలోని పైన పేర్కొన్న భూములే కాకుండా, నాకు మా నాయనమ్మ గారైన కూరపాటి వెంకట సుబ్బమ్మ గారి వలన నాకు సంక్రమించిన స్థిరాస్థి వట్లూరు గ్రామంలోని సర్వే నెం. 331లో య.0-07.50ట్లున్నూ, ఆర్.యస్.నెం.332/2లో య.0-01.25ట్లు వెరశి య.0.08.75ట్లు సంక్రమించినది. సర్వే నెం. 331లో య.0-07.50ట్లు, సర్వే నెం.331లో య.0-74ట్లు, సర్వే నెం.332/3లో య.0-06ట్లు, సర్వే నెం. 332/2లో య.0-86.50ట్లు, సర్వే నెం.332/2లో య.0-01.25ట్లు, సర్వే నెం.345రులో య.1-12ట్లు, సర్వే నెం.358/2లో య.0-44.50ట్లు, వెరశి మొత్తం య.3-31.75ట్లు పై సంక్రమించి ఆస్థిని నేను తదాది నాటినుండి నేటివరకు నాయొక్క సంపూర్ణ స్వాధీన అనుభవ హక్కుభుక్తములతో అనుభవించుచున్న స్థిరాస్థి పెదపాడు మండల తహశీల్దారు వారు ఇ.పట్టాదార్ పాస్బుక్ ఖాతా నెం. 2730 పట్టా మంజూరు చేసియున్నారు. పై తెల్పిన స్థిరాస్థిలో సర్వే నెం.331, 332/2లో య.0-50ట్లు ఏలూరు నగరం, దక్షిణపువీధి కాపురస్తులు కోరుకొండ రామకృష్ణ గారి భార్య కోరుకొండ కోటేశ్వరి లక్ష్మీ గారికి అగ్రిమెంటు చేసియుండుట తప్ప మరెవ్వరికీ ఏవిధమైన తనఖా, హామీ, లీజు, కోర్టుజప్తులు వగైరాలు చేసియుండలేదనిన్నీ, కాగా, పై తెల్పిన స్థిరాస్థిపై కొంతమంది అక్రమార్కులు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి, ఆస్థిని అన్యాక్రాంతం చేయాలని ప్రయత్నించు చున్నట్లుగా తెలియవచ్చినది. కనుక అటువంటి లావాదేవీలు ఏమి జరిగినను నా క్లయింటుకు సంబంధం లేదని అవి నా క్లయింటును బాధ్యులను చేయజాలరని ఇందుమూలముగా తెలియజేయటమైనది. అటుల చేసిన వారిపై తగు చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని ఇందుమూలముగా హెచ్చరించుచున్నాము.

కె.వి.రత్నం
అడ్వకేట్, ఏలూరు. సెల్: 98667 27232